క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు పైనాపిల్ కాలనీ 33/11 కేవీ ఎస్ఎస్ 11 కేవీ పరిధి దుర్గా నగర్ ఫీడర్‌లో మరమ్మతుల నిమిత్తం ఈ నెల 25న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని జోన్–3 ఈఈ పి.శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఆరిలోవ ప్రాంతం పాండురంగాపురం, శివాజీ నగర్, ప్రగతినగర్, లక్ష్మీనగర్, దుర్గానగర్, నెహ్రూ నగర్ ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

హనుమంతరావుకు అభినందన



అసిస్టెంట్ ప్రొఫెసర్ హనుమంతరావును అభినందిస్తున్న వీసీ శశిభూషణరావు

విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.హనుమంతరావును ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు అభినందించారు. ఇటీవల మలేషియాలో జరిగిన ఇండో–మలేషియా ఎడ్యుకేషనల్ ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానోత్సవంలో డాక్టర్ హనుమంతరావుకు 'ది బెస్ట్ అకడమిక్ రీసెర్చర్ ఇన్ మేనేజ్‌మెంట్ స్టడీస్' అవార్డు లభించింది. ఈ సందర్భంగా ఆయనకు బుధ వారం తన కార్యాలయంలో వీసీ ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు, డీసీఎంఎస్ విభాగాధిపతి ఆచార్య జాలాది రవి తదితరులు పాల్గొన్నారు.

ఆచార్య ప్రసాదరావుకు సన్మానం



ఆచార్య ప్రసాదరావును సన్మానిస్తున్న ఏయూ వీసీ శశిభూషణరావు

విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల పూర్వ ప్రిన్సిపాల్, అర్థశాస్త్ర విభాగం విశ్రాంత ఆచార్యుడు బి.ప్రసాదరావును ఏయూ వీసీ ఆచార్య జి. శశిభూషణరావు బుధ వారం తన కార్యాలయంలో సన్మానించారు. ఆచార్యుడిగా, వర్సిటీలో విభిన్న పదవులను సమర్థవంతంగా నిర్వహించి, ఏయూ ఆంగ్ల మాధ్యమం పాఠశాల కరస్పాండెంట్‌గా అవిశ్రాంత సేవలు అందిస్తున్న ప్రసాదరావును వీసీ అభినందించారు. పాఠశాల విద్యను బలోపేతం చేయాలన్న లక్ష్యంతో ఎన్నో వ్యయ, ప్రయాసలకు ఓర్చి ఆంగ్ల మాధ్యమం పాఠశాలను అభివృద్ధి చేసిన విధానం ప్రశంసనీయమన్నారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు పాల్గొన్నారు.

విరిగిన స్తంభం తొలగింపు



పిఠాపురం కాలనీ సర్వీస్ రోడ్డులో తొలగించిన విద్యుత్ స్తంభం

మద్దిలపాలెం: పిఠాపురం కాలనీలో సర్వీస్ రోడ్డులో గుర్తు తెలియని వాహనం ఢీకొని విరిగిపోయిన విద్యుత్ స్తంభాన్ని ఎట్టకేలకు తొలగించారు. ఈ సమస్యపై 'ప్రమాదభరితంగా విద్యుత్ స్తంభం' అనే శీర్షికన ఈ నెల 20న 'సాక్షి'లో ప్రచురితమైన వార్తకు ఏపీఈపీడీసీఎల్ సిబ్బంది స్పందించారు. బుధవారం విరిగిన స్తంభాన్ని తొలగించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

ఆర్టీసీ ఆదాయానికి ఆటోల గండి!

- మద్దిలపాలెం బస్ కాంప్లెక్స్ వద్ద అడ్డదిడ్డంగా నిలిపివేత
- ప్రయాణికులను చుట్టుముడుతున్న ఆటోవాలాలు
- ట్రాఫిక్ సమస్యతో తీవ్ర ఇబ్బందులు
- పట్టించుకోని ఆర్టీసీ అధికారులు



మద్దిలపాలెం ఆర్టీసీ బస్ కాంప్లెక్స్ వద్ద రోడ్డుకు అడ్డంగా ఆటోలు



మద్దిలపాలెం బస్ కాంప్లెక్స్‌లో నిలిపిన ఆటోలు

మద్దిలపాలెం: ప్రజా రవాణా శాఖ ఆదాయానికి ప్రైవేట్ ఆటోలు గండికొడుతున్నాయి. మద్దిలపాలెం ఆర్టీసీ బస్ కాంప్లెక్స్ ఎదురుగానే ఆటోలు నిలిపి బహిరంగంగా ప్రయాణికులను పిలుస్తూ సర్వీసులు చేస్తున్నారు. దీంతో ఈ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యలు నిత్యం పెరుగుతున్నాయి. ఇదంతా ఆర్టీసీ అధికారుల కళ్లెదురుగానే జరుగుతున్నా.. తమకేం పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కాంప్లెక్స్ చుట్టూ అడ్డదిడ్డంగా ఆటోలు నిలిపేసి బస్సుల రాకపోకలకు సైతం ఇబ్బంది కలిగిస్తున్నా.. ఎలాంటి సూచనలు, హెచ్చరికలు చేయకపోవడం గమనార్హం. దీంతో ఆటోల వలయంగా మద్దిలపాలెం మెయిన్ రోడ్డు మారిపోయింది. బస్ కాంప్లెక్స్ చుట్టూ ఆటోలు నిలిపి సర్వీసులు చేయడంతో ఆర్టీసీ ఆదాయానికి గండి పడుతోంది. బస్ స్టేషన్‌కు వచ్చే ప్రయాణికులను ఎక్కించుకోడానికి ఆటోవాలాలు పోటీ పడుతున్నారు. ఇదే ప్రాంతంలో శ్రీకాకుళం, విజయనగరం టాటా ఏస్ ఆటోల డ్రైవర్లు ప్రయాణికులను పిలిచి సర్వీస్ చేసుకుంటున్నారు. దీంతో ఆర్టీసీ బస్సు కంటే ముందుగా గమ్యం చేరడానికి కొందరూ ప్రయాణికులు ఆటోలను ఆశ్రయిస్తున్నారు.

బస్ స్టేషన్‌కు దారేది..?

నిత్యం రద్దీగా ఉండే మద్దిలపాలెం రోడ్డులో ఆటోలను ఇష్టానుసారంగా ఆపి సర్వీసులు చేయడం వల్ల ఇతర వాహన చోదకులు ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకుంటున్నారు. బస్ స్టేషన్‌కు వెళ్లాలన్నా, అక్కడ నుంచి బయటకు రావాలన్నా ప్రయాణికులు పడరాని పాట్లు పడుతున్నారు. బస్ కాంప్లెక్స్ వద్ద ఇబ్బందిపడేలా ఆటోలను రోడ్డుపై అడ్డంగా ఆపుతున్నారని ప్రయాణికులు మండిపడుతున్నారు. వచ్చి పోయే బస్సులు, ప్రయాణికులు రాకపోకలు చేయడానికి వీలు లేకుండా ఎక్కడపడితే అక్కడ ఆటోలు నిలిపేయడంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. బస్సులు కాంప్లెక్స్ నుంచి బయటకు వచ్చే క్రమంలో ట్రాఫిక్ రద్దీ ఏర్పడుతోంది. ఆటోలను దాటి వెళ్లడానికి వాహన చోదకులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో చిన్న చిన్న ప్రమాదాలు, తగాదాలు జరుగుతున్నాయి.

బస్‌స్టాప్ వద్ద అంతే..

ఇదే ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా రోడ్డు అవతల వైపు గల మద్దిలపాలెం బస్‌స్టాప్ వద్ద ఇదే పరిస్థితి. బస్‌స్టాప్ వద్దకు బస్సులు వెళ్లేందుకు వీలు లేకుండా ఆటోలను నిలిపివేస్తున్నారు. ఇసుకతోట వైపు నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వైపు వెళ్లే ఆటోలను అక్కడే ఆపి సర్వీసులు చేస్తున్నారు. ఆ సమయంలో బస్సులు వచ్చినా, హారన్ కొట్టిన ఏమాత్రం పట్టించుకోకుండా సర్వీసులు చేయడంపై ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చర్యలు అవసరం

మద్దిలపాలెం బస్ కాంప్లెక్స్‌కు కూత వేటు దూరంలో ట్రాఫిక్ పోలీస్ అవుట్ పోస్ట్ ఉంది. అక్కడ విధుల్లో ఉన్న సిబ్బంది ఆర్టీసీ కాంప్లెక్స్, మద్దిపాలెం బస్‌స్టాప్‌ల వద్ద నెలకుంటున్న ట్రాఫిక్ ఇబ్బందులను సరిచేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఆటోలను ఎక్కడికక్కడ రోడ్లపై నిలిపి సర్వీసులు చేయడంతో ట్రాఫిక్ రద్దీ విపరీతంగా ఏర్పడుతోంది. ఈ సమస్య పరిష్కారానికి ఆటోలను క్రమపద్ధతిలో ట్రాఫిక్ నిబంధనలకు అనుగుణంగా నిలిపేలా ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపట్టాలని ప్రయాణికులు, వాహన చోదకులు కోరుతున్నారు.

విదేశీ విద్యార్థుల హాస్టల్ సందర్శన



ఏయూ రిజిస్ట్రార్ ధనుంజయరావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సిబ్బంది

విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం విదేశీ విద్యార్థుల హాస్టల్‌ను బుధవారం మధ్యాహ్నం ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనంజయరావు సందర్శించారు. ఈ సందర్భంగా హాస్టల్స్‌లో కల్పిస్తున్న సదుపాయాలను విద్యార్థులను అడిగి ఆయన తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి అక్కడే భోజనం చేశారు. ఏయూ పూర్తి స్థాయిలో విద్యార్థులకు సహకారం అందిస్తూ పరిపాలన సాగిస్తోందని చెప్పారు. విద్యార్థులకు ఎటువంటి సహాయం అవసరమైన వెంటనే తమను సంప్రదించాలని సూచించారు. ఇటీవల కాలంలో హాస్టల్స్‌లో చేపట్టిన మరమ్మతులు, నిర్వహించిన అభివృద్ధి కార్యక్రమాలను చీఫ్ వార్డెన్ డాక్టర్ ఎస్.ఎం.యుగంధర్ వివరించారు. హాస్టల్ అభివృద్ధికి అవసరమైన సంపూర్ణ సహకారాన్ని సత్వరమే అందిస్తామని రిజిస్ట్రార్ తెలిపారు. అకడమిక్ డీన్ ఆచార్య కె.ఈశ్వర్‌కుమార్, దూర విద్య సంచాలకుడు ఆచార్య ఎన్.విజయమోహన్, డీసీఎంఎస్ విభాగాధిపతి ఆచార్య జాలాది రవి, డాక్టర్ సిహెచ్.ఆశ ఇమ్మానియల్ రాజు, డీన్లు ఆచార్య భాస్కర్‌రెడ్డి, ఆచార్య ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సెమినార్ హాల్ నిర్మాణ పనుల పరిశీలన



సెమినార్ హాల్ పనులను పరిశీలిస్తున్న ఏయూ వీసీ శశిభూషణరావు

విశాఖ సిటీ: ఆంధ్రా యూనివర్సిటీ సిల్వర్ జూబ్లీ క్రీడా మైదానంలో నిర్మిస్తున్న డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్‌కు సంబంధించిన శ్రీరామనేని కోదండ రామయ్య సెమినార్ హాల్ పనులను బుధ వారం ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు పరిశీలించారు. ఈ సందర్భంగా పూర్వ అంతర్జాతీయ వాలీబాల్ కోచ్, విశాఖ ఒలింపిక్ అసోసియేషన్ మాజీ చైర్మన్ కోదండ రామయ్య పేరు మీద ఏయూలో 250 చైర్స్ గల సెమినార్ హాల్ నిర్మించడంపై ఆయన కుమారుడు రామినేని శ్రీధర్‌ను వీసీ అభినందించారు. ఏయూ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆచార్య ఎన్.విజయ్‌మోహన్ మాట్లాడుతూ సుమారు రూ.2 కోట్లతో అన్ని సౌకర్యాలతో సెమినార్ హాల్ నిర్మిస్తున్న శ్రీధర్‌ను అభినందించారు. మరో మూడు అంతస్తులు నిర్మించేలా ఫౌండేషన్ ఏర్పాటు చేయడం శుభపరిణామమన్నారు. ఈ సెమినార్ హాల్‌కు సెంట్రల్ ఏసీతోపాటు సదస్సులు నిర్వహించేందుకు అన్ని సదుపాయాలు కల్పించారని చెప్పారు. వీసీతోపాటు ఏపీ ఒలింపిక్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ రామినేని శివలింగప్రసాద్, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ రామినేని శ్రీధర్ ఉన్నారు.

27న ఏబీవీపీ యూనివర్సిటీ సమ్మేళనం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మేడపాటి రవీంద్ర, ఏబీవీపీ నాయకులు

ఎంవీపీకాలనీ: ఏబీవీపీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఏపీ యూనివర్సిటీ సమ్మేళనం పోస్టర్‌ను బీజేపీ విశాఖ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర ఏబీవీపీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. లాసన్స్ బే కాలనీలోని బీజేపీ నగర కార్యాలయంలో బుధవారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏబీవీపీ ఆధ్వర్యంలో ఈ నెల 27న గుంటూరులోని నాగార్జున యూనివర్సిటీ వేదికగా యూనివర్సిటీ విద్యార్థుల సమ్మేళనం జరగనుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రం నలుమూలల నుంచి యూనివర్సిటీల విద్యార్థులు హాజరు కానున్నారన్నారు. ఇందుకు అనుగుణంగా ఏబీవీపీ విద్యార్థి విభాగం అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏబీవీపీ ఏయూ అధ్యక్షుడు డి.నరసింహ, విద్యార్థి నాయకులు నాగాంజి నాయక్, శ్రీనివాసులు, వెంకయ్యనాయుడు, సునీల్, ప్రసాద్, చక్రవర్తి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఆరిలోవ పీఎస్ పరిధిలో కార్డన్ సెర్చ్

తనిఖీల్లో 14 ద్విచక్ర వాహనాలు సీజ్‌చేసిన పోలీసులు



పోలీసులు సీజ్‌చేసిన ద్విచక్ర వాహనాలు



మాట్లాడుతున్న ద్వారకా ఏసీపీ రాంబాబు

ఆరిలోవ: ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధ వారం పోలీస్ అధికారులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాలతో కార్డన్ సెర్చ్‌లో భాగంగా ద్వారకా ఏసీపీ వై.రాంబాబు ఆధ్వర్యంలో ఆరిలోవ సీఐ మల్లేశ్వర రావు, ఎస్ఐలు తనిఖీలు చేపట్టారు. ఉదయం 4.30 నుంచి 9 గంటల వరకు పైనాపిల్ కాలనీ, జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ, రామకృష్ణాపురం కాలనీల్లో సుమారు 40 మంది పోలీస్ సిబ్బంది తనఖీలు చేశారు. ఆయా కాలనీల్లోని వీధుల్లో తిరిగారు. ఇళ్ల ముందు నిలిపిన వాహనాలను పరిశీలించారు. వాటి పత్రాలు చూపించాలని వాహన యజమానులను అడిగారు. ఎటువంటి పత్రాలు చూపని వారి నుంచి 14 వాహనాలను స్వాధీనం చేసి సీజ్ చేశారు. వాటిని ఆరిలోవ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

నేర రహిత నగరానికి కృషి

ఈ సందర్భంగా ఏసీపీ రాంబాబు మాట్లాడుతూ విశాఖను నేర రహిత నగరంగా తీర్చిదిద్దడానికి పోలీసులు కృషి చేస్తున్నట్లు తెలిపారు. నగరంలోని కొన్ని ప్రాంతాల్లోకి కొత్త వారు ప్రవేశించారా, వారు ఎక్కడి నుంచి వచ్చారు, వారికి సంబంధించిన వివరాలను సేకరిస్తున్నామన్నారు. ఇళ్ల ముందు నిలిపిన వాహనాలు వారివా కాదా అనే దానిపై ఆరా తీస్తున్నామని చెప్పారు. గంజాయి తదితర అసాంఘిక కార్యకలాపాలకు యువత గురికాకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. గంజాయి, మత్తు పదార్థాలు, చెడు వ్యసనాలకు బానిస కావద్దని యువతకు సూచించారు. నగరాభివృద్ధికి సహకరించాలని ఏసీపీ కోరారు.

పోలియోపై నిర్లక్ష్యం వద్దు

బీచ్‌రోడ్డు: పోలియో వ్యాధిపై నిర్లక్ష్యం వద్దని చిన్న పిల్లల వైద్యులు సూచిస్తున్నారు. కొన్నేళ్లుగా దేశంలో పోలియో కేసులు నమోదు కాకపోవడంతో పిల్ల లకు పోలియో టీకాలు వేయించడంలో తల్లిదండ్రు లు నిర్లక్ష్యం వహిస్తున్నారని చెబుతున్నారు. ఇలా నిర్లక్ష్యం చేయడం వల్లే మేఘాలయ రాష్ట్రంలో పోలియో కేసులు నమోదైనట్లు వారు తెలియజేస్తున్నారు. గురువారం ప్రపంచ పోలియో నివారణ దినోత్సవం సందర్భంగా తల్లిదండ్రులకు పోలియో టీకాలపై వైద్యులు అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం నగరంలో నిర్వహించిన అవగాహన సదస్సులో డాక్టర్ సాయిసునీల్ కిషోర్ మాట్లాడుతూ పోలియోకు వ్యతిరేకంగా తల్లిదండ్రులు పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్ల లోపు పిల్లలకు ఇనాక్టివేటెడ్ పోలియో వ్యాక్సిన్(ఐపీవీ) వేయడం ద్వారా పోలియో వైరస్ వ్యాప్తిని అరికట్టవచ్చని చెప్పారు. డాక్టర్ సతీష్‌కుమార్ మాట్లాడుతూ పోలియో రహిత భారత్ వంటి దేశాల్లో మళ్లీ రాకుండా నివారించడానికి తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇండియన్ అకాడమీ ఆఫ్ పిడియాట్రిక్స్ అడ్వైజరీ కమిటీ ఆన్ వ్యాక్సిన్స్ అండ్ ఇమ్యూనైజేషన్ సిఫార్సు చేసిన టీకాలు, బూస్టర్లను చిన్నారులకు షెడ్యూల్ ప్రకారం కచ్చితంగా వేయాలని సూచించారు.

అణుశక్తిపై పాఠశాల విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు వ్యాసరచన పోటీ నిర్వహిస్తున్న సంస్థ ప్రతినిధి

ఎంవీపీకాలనీ: అణుశక్తిపై పాఠశాల స్థాయి విద్యార్థులకు అవగాహన కల్పించారు. న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్, ఎగ్జికాన్ ఈవెంట్స్ మీడియా సొల్యూషన్స్ లిమిటెడ్ సంయుక్తంగా బుధవారం ఈ కార్యక్రమం నిర్వహించాయి. ది పవర్ ఛాంప్స్ పేరిట ఎంవీపీ కాలనీ, సీతమ్మధార ప్రాంతాల్లోని పలు పాఠశాలల్లో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అణుశక్తి ఉత్పత్తి, దాని సామర్థ్యం, వినియోగంతోపాటు సమస్యలను విద్యార్థులకు తెలియజేశారు. దేశంలో ఇంధనం భవిష్యత్ వినియోగం, ఉత్పత్తి సవాళ్లపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయా అంశాల్లో, పర్యావరణ పరిరక్షణలో విద్యార్థుల సామాజిక బాధ్యతను వివరించారు. ఆయా పాఠశాలలకు చెందిన వెయ్యి మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ అంశంపై నిర్వహించిన అవగాహన చర్చలు, వ్యాసరచన, డ్రాయింగ్ పోటీల్లో విద్యార్థులు చురుగ్గా పాల్గొన్నారు. ఆయా సంస్థల ప్రతినిధులతోపాటు పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తోపుడుబండ్ల కార్మికులపై దాడులు ఆపాలి



మాట్లాడుతున్న సిటూ నేత కుమార్



మద్దిలపాలెం కూడలిలో ర్యాలీ చేస్తున్న తోపుడుబండ్ల కార్మికులు

మద్దిలపాలెం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విశాఖలోని తోపుడుబండ్ల కార్మికులపై దాడులు పెరిగాయని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. మద్దిలపాలెం వద్ద బుధవారం తోపుడుబండ్ల కార్మికులతో సభ నిర్వహించారు. ముందుగా మద్దిలపాలెంలో తోపుడుబండ్ల కార్మికులతో కలిసి ర్యాలీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రెక్కాడితే గాని డొక్కాడని తోపుడుబండ్లు చిల్లర వర్తకులపై కొత్తగా వచ్చిన జీవీఎంసీ కమిషనర్, జోనర్ కమిషనర్, ఇతర అధికారులు దాడులు చేయడం సరికాదని విమర్శించారు. విశాఖ నగరంలో సుమారు లక్ష మంది కార్మికులు తోపుడు బండ్లు, నేల వ్యాపారాలపై ఆధారపడి జీవిస్తున్నారని, పిచ్చుక మీద బ్రహ్మాస్త్రంలా వారిపై దాడులు చేయడం ఏంటని అధికారులను ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం తోపుడుబండ్లు వర్తక కార్మికుల ఉపాధికి హామీ, రక్షణ కల్పించాలని, వెండింగ్ జోన్ ఏర్పాటు చేయాలని కోరారు. మద్దిలపాలెం జోన్ తోపుడుబండ్లు చిల్లర వర్తకల కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు పి.వెంకటరావు మాట్లాడుతూ స్ట్రీట్ వెండర్స్ కార్డులు తోపుడుబండ్ల కార్మికులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే జీవీఎంసీ అధికారులు సిరిపురం, కొటక్ స్కూల్ ఎదురుగా, రైల్వే గెస్ట్ హౌస్ ఫుట్‌పాత్‌పై ఉన్న తోపుడుబండ్లను తొలగించారన్నారు. సీఐటీయూ నాయకుడు వి.కృష్ణారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో నిత్యావసర వస్తువుల ధరలు పెంచి ప్రజలపై భారం మోపిందన్నారు. తోపుడుబండ్ల కార్మికులపై దాడులు ఆపకపోతే జీవీఎంసీ ప్రధాన కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు అనపర్తి అప్పారావు, కె.కుమారి, నాయకులు అప్పారావు, వై.సాయి, 15 సెంటర్ల నుంచి 120 మంది కార్మికులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్



హెల్మెట్ ధరించని వాహన చోదకులకు సూచనలిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

మద్దిలపాలెం: ఈస్ట్ డివిజన్ ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనాలు నడుపుతున్న వారిని గుర్తించి అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం మద్దిలపాలెం కూడలి వద్ద ట్రాఫిక్ ఎస్ఐ కనకరాజు బృందం తనిఖీలు చేపట్టింది. వాహనాల రికార్డులను పరిశీలించి, హెల్మెట్ ధరించని వారిపై కేసులు నమోదు చేశారు. విధిగా హెల్మెట్ ధరించాలని వాహన చోదకులకు ట్రాఫిక్ పోలీసులు సూచించారు.

ఆదర్శనగర్‌లో వెలగని వీధిలైట్లు

ఎంవీపీకాలనీ: జీవీఎంసీ 17వ వార్డు ఆదర్శనగర్‌లోని పలు వీధుల్లో విద్యుత్ లైట్లు వెలగడం లేదని స్థానికులు చెబుతున్నారు. జన సాంద్రత అధికంగా ఉండే ఈ కాలనీలోని ఇరుకు రోడ్లలో విద్యుత్ దీపాలు వెలగకపోవడంతో పూర్తి అంధకారం నెలకొని సమస్యలు ఎదుర్కొంటున్నామన్నారు. ఈ సమస్యపై పలుమార్లు విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

మానసిక వికాసానికి క్రీడలు దోహదం



పోటీల ఎంపికలో పాల్గొన్న క్రీడాకారిణులతో ఆంధ్రా యూనివర్సిటీ వీసీ శశిభూషణరావు

విశాఖ సిటీ: క్రీడలు విద్యార్థుల మానసిక వికాసానికి దోహదపడతాయని ఆంధ్రా యూనివర్సిటీ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు పేర్కొన్నారు. ఏయూ జిమ్నాజియంలో బుధవారం నిర్వహించిన మహిళల అంతర కళాశాలలు, యూనివర్సిటీల స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ఎంపిక కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. వర్సిటీ నుంచి క్రీడల్లో పాల్గొనేందుకు వెళ్లే క్రీడాకారులకు టీఏ, డీఏలు కూడా అందిస్తామని చెప్పారు. ఇందులో ప్రతిభ చూపిన వారికి ప్రోత్సాహకం ఉంటుందన్నారు. అనంతరం ఏయూ గుర్తింపు కళాశాలల నుంచి వచ్చిన కబడ్డీ జట్లను పరిచయం చేసుకున్నారు. పోటీలను ప్రారంభించి క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. ఏయూ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆచార్య ఎన్.విజయ్‌మోహన్ మాట్లాడుతూ ఏయూ గుర్తింపు పొందిన కళాశాలల నుంచి 250 మందికి పైగా కబడ్డీ పోటీల ఎంపికలో పాల్గొంటున్నట్లు చెప్పారు. ఈ పోటీల్లో రాణించిన వారు యూనివర్సిటీ జట్టుకు ఎంపికవుతారన్నారు. కార్యక్రమంలో బ్యూటిఫికేషన్ డీన్ ఆచార్య ధనరాజ్, కబడ్డీ కోచ్ డాక్టర్ కృష్ణారెడ్డి, డాక్టర్ వి.ఎస్.కృష్ణా డిగ్రీ, పీజీ కళాశాల లెక్చరర్ ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ సంధ్యారాణి, ఐబీపీఈ క్రీడాధికారి డాక్టర్ జి.వెంకటేశ్వరరావు, గొన్నా కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల ఎదురుగా చెత్త డంపింగ్



కేడీపీఎం హైస్కూల్ ఎదురుగా పారబోసిన వ్యర్థాలు

బీచ్‌రోడ్డు: పెదవాల్తేరు కేడీపీఎం హైస్కూల్ ఎదురుగా వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. స్కూల్ ముఖం ద్వారా ఎదురుగా స్థానికులు వ్యర్థాలు డంప్ చేయడం వల్ల దుర్వాసనతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారు. పాఠశాల ఉందని కూడా చూడకుండా స్థానికులు చెత్త వేస్తుండటంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ అధికారులు స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

15న రాధాకృష్ణ మహోత్సవం



ఉత్సవ పోస్టర్ ఆవిష్కరిస్తున్న జిల్లా యాదవ సంఘం ప్రతినిధులు

మద్దిలపాలెం: విశాఖ జిల్లా యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నవంబర్ 15వ తేదీన కార్తీక పౌర్ణమి రోజు రాధాకృష్ణ మహోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు ఒమ్మి సన్యాసిరావు, ప్రధాన కార్యదర్శి బొట్టా వెంకటరమణ తెలిపారు. ఉత్సవ పోస్టర్‌ను సంపత్ వినాయగర్ ఆలయంలో బుధవారం ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఈ ఉత్సవానికి ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అధిక సంఖ్యలో యాదవులు హాజరయ్యేలా విస్తృత ప్రచారం చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా యాదవ సంఘం ప్రతినిధులు గొంప అప్పారావు, సారిపిల్లి కృష్ణ, అక్కరమాని శేఖర్, ఉప్పిలి కనకరాజు, ఒమ్మి అప్పారావు, డొక్కరి శ్రీనివాసరావు, బొట్టా పరదేశి తదితరులు పాల్గొన్నారు.

రేపు తాగునీటి సరఫరాకు అంతరాయం

డాబాగార్డెన్స్: జోన్–3 పరిధి 24, 26 వార్డుల్లో ఈ నెల 25న జీవీఎంసీ తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని విభాగం కార్యనిర్వాహక ఇంజినీర్ టి.ఎల్.సుధాకర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీతమ్మధార టీపీటీ కాలనీ ప్రాంతంలో 400 ఎంఎం వ్యాసం గల మంచినీటి సరఫరా పైప్‌లైన్ మరమ్మతులకు గురైనందున శుక్రవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు 24వ వార్డు టీపీటీ కాలనీ, పీ అండ్ టీ కాలనీ, నక్కవానిపాలెం, గాంధీనగర్, చైతన్యనగర్, క్రాంతినగర్, శారదా స్కూల్ ప్రాంతం, 26వ వార్డు రామకృష్ణానగర్, లలితానగర్, శంకరమఠం మెయిన్‌రోడ్డు, చిన్నూరు, మంగళ వీధి ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా జరుగుతుందని, అసౌకర్యానికి ప్రజలు సహకరించాలని కోరారు.